


స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక



వరంగల్	సంపుటి : 02	సంచిక : 113	ఎడిటర్ : డి.శివకృష్ణ	బుధవారం	11-11-2026	పేజీలు : 04	వెల : 2/-
WARANGAL	VOL : 02	ISSUE : 113	EDITOR : D.SHIVAKRISHNA	WEDNESDAY	11-11-2026	PAGES : 04	PRICE : 2/-

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts

తెలంగాణకు రాహుల్ గాంధీ

గిగ్ వర్కర్లతో ప్రత్యేక సమావేశం.. : మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:



లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ త్వరలోనే తెలంగాణలో పర్యటించనున్నారు. ఈ నెల 13 లేదా 14 తేదీల్లో ఆయన హైదరాబాద్‌కు రానున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. మంగళవారం ఢిల్లీలో రాహుల్ గాంధీతో సుమారు అరగంట పాటు సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ 'భారత్ సమ్మిట్'లో పాల్గొననున్నారని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో గిగ్ వర్కర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని రాహుల్ గాంధీ స్వయంగా కోరారని చెప్పారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం (గిగ్ యాక్ట్) తీసుకువచ్చిన నేపథ్యంలో, రాహుల్ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. అలాగే, హైదరాబాద్‌లో 'సర్'కు వ్యతిరేకంగా నిర్వహించే సభతో పాటు, మెగా బీసీ ర్యాలీకి హాజరుకావాలని రాహుల్‌ను ఆహ్వానించామని, అయితే ఆ కార్యక్రమాల తేదీలు ఇంకా ఖరారు కాలేదని తెలిపారు. (మిగతా 2లో..)

'కన్వర్షన్ కింగ్'గా హసన్‌పర్తి తహసీల్దార్..?



- అవినీతి ఆరోపణలతో హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయం
- ఒక్కో నాలా కన్వర్షన్‌కు ఒక్కో రేటు..?
- వ్యవసాయ భూముల మార్పిడిలో భారీ అవినీతి ఆరోపణలు..
- రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అధికారుల అండదండలున్నాయా?..

స్టార్ త్రినేత్రం, నిఘా టీమ్:

హన్మకొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలంలో భూముల నాలా కన్వర్షన్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు, ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు, ప్లాట్లుగా మార్చే ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములు, అనుమతుల ప్రక్రియ కంటే అదనపు చెల్లింపులకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న నాలా కన్వర్షన్ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఒక్కో దరఖాస్తుకు ఒక్కో రేటు, ఒక్కో వెంచర్‌కు ఒక్కో విధమైన లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణలతో ఈ వ్యవహారం అధికార వర్గాల్లోనూ, స్థానికంగా చర్చకు దారితీస్తోంది. (మిగతా 2లో..)

టీ బీజేపీకి బిగ్ బూస్ట్..

నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన తేదీ ఖరారు

లక్ష మందితో మహాపాదయాత్ర



స్టార్ త్రినేత్రం, కరీంనగర్:

తెలంగాణ రాష్ట్రంలో మరింత బలపడి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ క్షేత్రస్థాయిపై దృష్టి సారించింది. ఈ క్రమంలో అగ్రనేతలు రాష్ట్ర పర్యటనలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాష్ట్రంలో పర్యటించగా తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన ఖరారైంది. ఈనెల 18న ఆయన కరీంనగర్‌కు రానున్నారు.

(మిగతా 2లో..)

కరవుతో ఇబ్బందుల్లో రైతులు..

పంట రుణాల రీషెడ్యూల్‌కు మంత్రి భట్టి ఆదేశాలు



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

రైతులకు బ్యాంకులు అండగా నిలవాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన ప్రత్యేక రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశానికి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొన్నాయని.. రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలని.. అర్హులైన రైతుల పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని ఆదేశించారు.

ఆ పంటలకు రుణాలు అందించాలి

రబీ సీజన్‌కు కొత్త పంట రుణాలను సకాలంలో అందించాలని భట్టి సూచించారు. బ్యాంకుల చుట్టూ రైతులు తిరిగే పరిస్థితి ఉండకూడదని తెలిపారు. విద్య, గృహ రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూలంగా ఉండాలని నిర్దేశించారు. ఎంఎస్ఎంఈ, మౌలిక (మిగతా 2లో..)

శబరిమల వెళ్లే అయ్యప్ప స్వాములకు అలర్ట్..

కేరళ ప్రభుత్వం కీలక ప్రకటన



(మిగతా 2లో..)

'ప్రణబ్ ప్రధాని కావాలనుకున్నారు'..

తన ఆత్మకథలో వెల్లడించిన సోనియా గాంధీ



ఢిల్లీ:

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రధానమంత్రి కావాలనే ఆకాంక్షను కలిగి ఉండేవారా? ఈ ప్రశ్నకు సంబంధించి కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తన కొత్త పుస్తకంలో ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. 2010లో తనతో జరిగిన ఓ సంభాషణలో ప్రణబ్ ముఖర్జీ చేసిన వ్యాఖ్యలు తనను ఆశ్చర్యానికి గురిచేశాయని తెలిపారు. నాయకత్వంలో మార్పు రావాల్సిన సమయం వచ్చిందని ఆయన సూచించారని తెలిపారు.సోనియా గాంధీ రాసిన 526 పేజీల పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' నవంబర్ 10న విడుదలైంది. ఇందులో తన వ్యక్తిగత జీవితంతో పాటు కాంగ్రెస్ రాజకీయాలు, యూపీఏ ప్రభుత్వంలో చోటుచేసుకున్న పరిణామాలు, మన్మోహన్ సింగ్, ప్రణబ్ ముఖర్జీలతో తన అనుబంధం గురించి పలు విషయాలను వెల్లడించారు. 2010లో కొన్నిసార్లు ప్రణబ్ ముఖర్జీ తనతో ప్రత్యేకంగా మాట్లాడేవారని సోనియా గుర్తుచేసుకున్నారు. నాయకత్వంలో మార్పు రావాల్సిన సమయం వచ్చిందని ప్రణబ్ తనతో అన్నారని, ఆ మాటలను ప్రధానమంత్రి కావాలనే ఆయన చిరకాల కోరికకు సంకేతంగా అర్థం చేసుకున్నానని సోనియా రాశారు. ఆయన వ్యాఖ్యలకు తాను సున్నితంగా స్పందిస్తూ సంభాషణను మరో అంశం వైపు మళ్లించానని చెప్పారు. దీనివల్ల ప్రణబ్ ముఖర్జీ కొంత నిరాశ చెంది ఉండవచ్చన్నారు. అయినప్పటికీ తనతో ప్రణబ్ ఎప్పుడూ మంచిగానే ఉన్నారని తెలిపారు. ప్రణబ్ ముఖర్జీకి ప్రధానమంత్రి పదవి దక్కకపోయినా, 2012లో యూపీఏ కూటమి తరపున రాష్ట్రపతి అభ్యర్థిగా కాంగ్రెస్ ఆయన పేరును ప్రకటించింది. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఆయన విజయం సాధించి భారత 13వ రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు.

'పుస్తకం చదవకుండానే విమర్శలా?'..

సోనియా ఆత్మకథపై బీజేపీకి శ్రీధర్ బాబు కౌంటర్



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ రాసిన ఆత్మకథ బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్‌పై భారతీయ జనతా పార్టీ నాయకులు చేస్తున్న విమర్శలపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. పుస్తకంలో ఏముందో కనీసం చదవకుండానే బీజేపీ నేతలు రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు గుప్పిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. సోనియాగాంధీ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివిన తర్వాత మాట్లాడితే అర్థం ఉంటుంది కానీ, చదవకుండానే రాజకీయం చేయడం సరికాదని మండిపడ్డారు. చారిత్రక పరిణామాలు, వ్యక్తిగత అనుభవాల ఆధారంగా రాసిన ఆత్మకథపై వాస్తవాలు తెలుసుకోకుండా అడ్డగోలుగా మాట్లాడటం బీజేపీ చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని శ్రీధర్ బాబు కామెంట్ చేశారు.

(మిగతా 2లో..)

దేశం గర్వించేలా ఖేలో ఇండియా..

అధికారులకు మంత్రి శ్రీహరి కీలక ఆదేశాలు



(మిగతా 2లో..)

‘కన్వర్షన్ కింగ్’గా హసన్‌పర్తి తహసీల్దార్..?

(మొదటిపేజీ తరువాయి)

‘కన్వర్షన్ కింగ్’గా తహసీల్దార్‌పై ఆరోపణలు..

హసన్‌పర్తి తహసీల్దార్ పరిధిలో నాలా కన్వర్షన్ కోసం వచ్చే దరఖాస్తుల విషయంలో నిబంధనల కంటే ముడుపులకే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారి సంతకం కావాలంటే అదనపు మొత్తాలు చెల్లించాల్సిందేననే ప్రచారం స్థానికంగా విస్తరించినట్లు తెలుస్తోంది. కార్యాలయంలో ఏ పని జరగాలన్నా చేతులు తడపాల్సిన పరిస్థితి ఉందంటూ కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఆరోపణల నేపథ్యంలోనే సదరు తహసీల్దార్‌ను కొందరు ‘కన్వర్షన్ కింగ్’గా అభివర్ణిస్తున్నారు. అయితే ఈ ప్రచారంలో వాస్తవమెంత, ఆరోపణలకు ఆధారాలున్నాయా అనే అంశాలు అధికారిక విచారణలోనే స్పష్టమవాల్సి ఉంది.

ఒక్కో నాలా కన్వర్షన్‌కు ఒక్కో రేటు..

భూమి విస్తీర్ణం, వెంచర్ స్వభావం, ప్లాట్ల సంఖ్యను బట్టి అదనపు వసూళ్లలో తేడాలు ఉంటున్నాయనే ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా వెంచర్లకు సంబంధించిన నాలా కన్వర్షన్ దరఖాస్తుల విషయంలో గజాల లెక్కన శాతం చొప్పున ముడుపులు వసూలు చేస్తున్నారనే ప్రచారం రియల్ ఎస్టేట్ వర్గాల్లో వినిపిస్తోంది. కొన్ని సందర్భాల్లో ప్లాట్ల విక్రయాలకు ముందే సంబంధిత అధికారులకు వాటా చెల్లించాల్సి వస్తోందనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ లావాదేవీలకు సంబంధించి ఇప్పటివరకు బహిరంగంగా ధ్రువీకరించిన ఆధారాలు అందుబాటులో లేవు. అధికారిక రుసుములకు అదనంగా ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తున్నారా? అలా వసూలు చేసిన మొత్తాలు ఎవరికి చేరుతున్నాయి? అనే అంశాలపై విచారణ జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

వెంచర్ల ఫైళ్లకే ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారా?

వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు మార్చే ప్రక్రియలో చట్టపరమైన నిబంధనలు, భూమి వాస్తవ స్థితిగతులు, అవసరమైన అనుమతులను పరిశీలించడం అధికారుల బాధ్యత. అయితే హసన్‌పర్తి మండల పరిధిలో కొన్ని వెంచర్లకు సంబంధించిన దరఖాస్తుల విషయంలో నిబంధనలను పక్కనపెట్టి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అదనపు మొత్తాలు చెల్లించిన ఫైళ్లు వేగంగా ముందుకు సాగుతుండగా, సాధారణ దరఖాస్తుదారుల ఫైళ్లు మాత్రం పెండింగ్‌లో ఉంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మధ్యవర్తుల ప్రమేయంతో కొన్ని వ్యవహారాలు మౌఖిక ఒప్పందాల రూపంలో సాగుతున్నాయనే ప్రచారం కూడా ఉంది. ఈ ఆరోపణలు నిజమైతే ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతోపాటు భవిష్యత్తులో ప్లాట్లు కొనుగోలు చేసే సామాన్య ప్రజలు సైతం ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

పదుల సంఖ్యలో వెంచర్లపై అనుమానాలు.. రికార్డులు పరిశీలిస్తేనే అసలు నిజాలు!

హసన్‌పర్తి మండల పరిధిలో ఇప్పటికే జరిగిన నాలా కన్వర్షన్‌లపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదుల సంఖ్యలో వెంచర్లకు సంబంధించిన భూముల మార్పిడి ప్రక్రియలో నిబంధనలు పాటించారా? అవసరమైన ప్రభుత్వ అనుమతులు పొందారా? వ్యవసాయ భూములను నివాస స్థలాలుగా మార్చే క్రమంలో చట్టపరమైన విధానాలను అనుసరించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొన్ని వెంచర్ల విషయంలో సరైన అనుమతులు లేకుండానే ప్లాట్లుగా మార్చి విక్రయాలకు సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా జరిగిన నాలా కన్వర్షన్ దరఖాస్తులు, వాటికి జతచేసిన పత్రాలు, క్షేత్రస్థాయి పరిశీలన నివేదికలు, చెల్లించిన ప్రభుత్వ రుసుములు, అనుమతుల ఉత్తర్వులను పరిశీలిస్తేనే వాస్తవ పరిస్థితి బయటపడే అవకాశం ఉంది.

ఉన్నతాధికారులు స్పందించాలి.. సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్!

హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయంలో నాలా కన్వర్షన్ వ్యవహారాలపై వస్తున్న ఆరోపణలను సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు తేలిగ్గా తీసుకోకూడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గతంలో అనుమతులు పొందిన వెంచర్ల వివరాలు, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వేగంగా ఆమోదం పొందిన ఫైళ్లు, వాటికి సంబంధించిన రికార్డులను ప్రత్యేక బృందంతో తనిఖీ చేయించాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైతే అవినీతి నిరోధక శాఖ ద్వారా కూడా విచారణ జరిపించి, ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూముల రక్షణతోపాటు వ్యవసాయ భూముల మార్పిడి ప్రక్రియ పారదర్శకంగా సాగాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది. ప్రజలకు సేవ చేయాల్సిన కార్యాలయాలపై అవినీతి ఆరోపణలు రావడం వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. మరి హసన్‌పర్తి నాలా కన్వర్షన్ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? ఆరోపణలపై విచారణకు ఆదేశిస్తారా? లేక ఈ వ్యవహారం ఇలాగే కొనసాగుతుందా? అన్నది వేచి చూడాలి.

శబరిమల వెళ్లే అయ్యప్ప స్వాములకు అలర్ట్..

జాతీయం:

శబరిమల యాత్రకు సిద్ధమవుతున్న అయ్యప్ప స్వామి భక్తులకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం, తిరువాంకూర్ దేవస్వం బోర్డు అధికారులు అత్యంత కీలకమైన సూచనలు జారీ చేశారు. శబరిమలలో స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులు ముందస్తుగా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవడం తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు.

వర్చువల్ క్యూ స్లాట్

శబరిమల శబరిమల క్షేత్రంలో భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడానికి, ప్రశాంత దర్శనం కల్పించేందుకు వర్చువల్ క్యూ విధానాన్ని అమలు చేస్తున్నారు. భక్తులు తమ యాత్ర ప్లాన్ చేసుకునే ముందే శబరిమల అధికారిక పోర్టల్ ద్వారా వర్చువల్ క్యూ స్లాట్‌ను ఖరారు చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకోకుండా నేరుగా వచ్చే భక్తులకు దర్శన సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. భక్తులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా ఎంతో సులభంగా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునేందుకు వీలుగా అధికారులు ఓ ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. భక్తులు తమ స్మార్ట్‌ఫోన్‌తో ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నేరుగా శబరిమల అధికారిక ఆన్‌లైన్ పోర్టల్‌కు చేరుకోవచ్చు.

బుకింగ్ తప్పనిసరి..

అక్కడ తమ వివరాలు, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డు నమోదు చేసి ఉచితంగా వర్చువల్ క్యూ స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. మండల-మకరవిలక్కు ఉత్సవాల సీజన్ ప్రారంభమవుతున్న వేళ, దేశ నలుమూలల నుంచి వచ్చే అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, ముందస్తుగా వర్చువల్ క్యూ స్లాట్‌లు నమోదు చేసుకుని సహకరించాలని అధికారులు కోరారు.

దేశం గర్వించేలా ఖేలో ఇండియా..

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

ఖేలో ఇండియా నిర్వహణపై మంత్రి వాకిటి శ్రీహరి మంగళవారం సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దేశం గర్వించేలా ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతోనే తెలంగాణలో ఖేలో ఇండియా నిర్వహించేందుకు అవకాశం వచ్చిందన్నారు. మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి భవిష్యత్ తరాలకు అందించాలని తెలిపారు. ఈ విషయంలో డిప్యూటీ కలెక్టర్లకు పూర్తి అధికారాలు ఇస్తున్నట్లు వెల్లడించారు.అనవసర ఖర్చులు వద్దని.. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు సాధించాలని మంత్రి చెప్పుకొచ్చారు. యువతను రీల్స్, బెట్టింగ్ మహమ్మారి నుంచి బయటకు తీసుకురావాలని డిప్యూటీ కలెక్టర్లకు మంత్రి వాకిటి శ్రీహరి సూచనలు చేశారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ స్పెషల్ సీఎస్ వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ వీసీఎండీ సోనిబాలాదేవి, వివిధ జిల్లాల డిప్యూటీ కలెక్టర్లు, స్పోర్ట్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

‘పుస్తకం చదవకుండానే విమర్శలా?’..

(మొదటిపేజీ తరువాయి)

భారత్ సమ్మిట్‌తో రాష్ట్రానికి గ్లోబల్ గుర్తింపు..

ఇదే సందర్భంగా ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక ‘భారత్ సమ్మిట్ 2026’పై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఈ సదస్సు తెలంగాణ అభివృద్ధికి గొప్ప ఊతాన్నిస్తుందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఇన్వెస్టర్లు, నిపుణులు విచ్చేసి కీలక అంశాలపై చర్చిస్తారని వెల్లడించారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ పారిశ్రామిక విధానాలను చాటి చెప్పడానికి, రాష్ట్రానికి గ్లోబల్ గుర్తింపు తీసుకురావడానికి ఈ భారత్ సమ్మిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు.

టీ బీజేపీకి బిగ్ బూస్ట్..

(మొదటిపేజీ తరువాయి)

‘సర్’ పేరిట రాజ్యాంగ సంస్థలపై విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నిర్వహించే పాదయాత్రకు హాజరై ప్రసంగించనున్నారు. నితిన్ నబిన్ తొలిసారి కరీంనగర్ రానున్న నేపథ్యంలో కనీవినీ ఎరగని రీతిలో “మహా పాదయాత్ర’ను సక్సెస్ చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్ణయించారు. ఈ మేరకు పాదయాత్రకు సంబధించిన ఏర్పాట్లపై చర్చించేందుకు మంగళవారం ఎంపీ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ నేతలతో కేంద్ర మంత్రి బండి సంజయ్ సమావేశమయ్యారు.

లక్షమందితో మహాపాదయాత్ర:

నితిన్ నబీన్ పర్యటన సందర్భంగా లక్ష మందితో కరీంనగర్?లో ‘మహా పాదయాత్ర’ నిర్వహించాలని బండి సంజయ్ సిద్ధమయ్యారు. గాంధీ సర్కిల్, వైశ్యా భవన్ నుండి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ దాకా నిర్వహించే ఈ పాదయాత్రలో లక్ష మందితో కలిసి నితిన్ నబిన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, బండి సంజయ్ అడుగులో అడుగు వేయనున్నారు. ఈ మేరకు మంగళవారం జరిగిన సన్నాహక సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. నితిన్ నబిన్ తొలిసారి కరీంనగర్ వస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా కరీంనగర్ పేరు మారుమోగేలా మహా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పాదయాత్రపై విస్తృత ప్రచారం:

‘సర్’ పై కాంగ్రెస్, ఇండీ కూటమి పేరుతో విపక్షాలు లేనిపోని దుష్ప్రచారం చేస్తూ ఎన్నికల సంఘాన్ని నీరుగార్చే కుట్రలతో రాజ్యంగ సంస్థలపై దాడి చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకే నితిన్ నబిన్ కరీంనగర్ వస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని కనీసం లక్ష మంది ఈ యాత్రకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు కూడా హాజరుకానున్న నేపథ్యంలో పోలింగ్ బూత్ కేంద్రాల నుండి శక్తి కేంద్రాలు, మండలాల వారీగా సమావేశాలు నిర్వహించాలని కోరారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా మహా పాదయాత్రపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

కరవుతో ఇబ్బందుల్లో రైతులు..

(మొదటిపేజీ తరువాయి)

సదుపాయాల రంగాలకు రుణాలు పెంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 365 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించామని.. 111 మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు ఉన్నట్లు తెలిపారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలకు రుణాలు అందించాలని.. పంటల మార్పిడి, సూక్ష్మ సేద్యానికి ఆర్థిక సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు.

అదనపు ఉపాధి కల్పించేలా చర్యలు

రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. 10 నుంచి 15 శాతం రైతు కుటుంబాలకు అదనపు ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు అదనంగా రూ.2 లక్షల వరకు రుణాలపై పరిశీలన చేయాలని అన్నారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు ఇవ్వాలని నిర్దేశించారు. ఈ నెల 19 నాటికి రాజీవ్ యువ వికాసం అమలుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. రైతులు తదుపరి వ్యవసాయ సీజన్‌ను ఆత్మవిశ్వాసంతో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

తెలంగాణకు రాహుల్ గాంధీ

(మొదటిపేజీ తరువాయి)

ఓబీసీ ప్రాతినిధ్యం, పార్టీ కార్యక్రమాలపై చర్చ

రాహుల్ గాంధీతో జరిగిన సమావేశంలో ప్రధానంగా ఓబీసీల అంశం, వారికి కల్పిస్తున్న ప్రాతినిధ్యంపై చర్చించినట్లు టీపీసీసీ చీఫ్ పేర్కొన్నారు. తెలంగాణలో పీసీసీ అమలు చేస్తున్న కార్యక్రమాలపై రాహుల్‌కు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగతంగా కాంగ్రెస్ చేపట్టిన కార్యక్రమాలను ఆయనకు వివరించామన్నారు.

నవంబర్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ:

రాష్ట్ర కాంగ్రెస్ నేతల మధ్య ఉన్న గొడవలు, పంచాయితీలపై రాహుల్ గాంధీతో ఎలాంటి చర్చ జరగలేదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఆ వ్యవహారాలను పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చూసుకుంటారని తెలిపారు. ఇక నవంబర్ నెలలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన ప్రకటించారు. మరోవైపు, సోనియా గాంధీ ఆత్మకథను తాము స్వాగతిస్తున్నామని, తెలంగాణలో ఆ పుస్తకంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

ఓయూ ఆర్ట్స్ క్యాంటీన్‌లో తెలంగాణ గిరిజన ఉద్యమకారుల ఆత్మీయ కలయిక




స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

తెలంగాణ గిరిజన ఉద్యమకారులు, వివిధ గిరిజన సంఘాల ముఖ్య నాయకులు సుదీర్ఘ విరామం అనంతరం ఓయూ ఆర్ట్స్ కాలేజీ క్యాంటీన్ వేదికగా సమావేశమయ్యారు. గతంలో ఉద్యమాలకు వేదికగా నిలిచిన ఆర్ట్స్ క్యాంటీన్‌లో మంగళవారం నాడు జరిగిన ఈ భేటీ ఉద్యమ జ్ఞాపకాలను నెమరువేసుకోవడానికి, ప్రస్తుత గిరిజన సమస్యలపై చర్చించడానికి వేదికైంది. రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగిన ఈ సమావేశానికి లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు, మాజీ ట్రైకార్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్, సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షుడు భూక్య సంజీవ్ నాయక్,తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం గిరిజన సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పార్టీల విభేదాలు పక్కనబెట్టి గిరిజన, బహుజన వర్గాల అభ్యున్నతికి కార్యాచరణ రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచి గిరిజన సమస్యలపై పోరాడిన ఉద్యమకారులందరూ మళ్లీ ఒకేచోట కలుసుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ నాయక్, తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మైత్రి శ్రీపురం కాలనీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు



స్టార్ త్రినేత్రం, పెద్ద అంబర్‌పేట్:

పెద్ద అంబర్‌పేట్ 52వ డివిజన్ పరిధిలోని మైత్రి శ్రీపురం కాలనీతో పాటు పలు కాలనీల అభివృద్ధి పనులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తక్షణమే నిధులు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన అధికారిక మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే విడుదల చేశారు. ముఖ్యంగా మైత్రి శ్రీపురం కాలనీలో అత్యవసరంగా అవసరమైన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్, బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, కమ్యూనిటీ హాల్ పైన నూతన లైబ్రరీ భవనాన్ని నిర్మించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనితో పాటుగా హరితహారం కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులు, శ్రీ లక్ష్మీ కుటీర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం మరియు ఓపెన్ జిమ్ పరికరాల ఏర్పాటు అంశాలను వివరించారు. మైత్రి శ్రీపురం కాలనీవాసుల ప్రధాన సమస్యలపై వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కాలనీ ప్రతినిధులు, స్థానిక నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గంట లక్ష్మారెడ్డి, స్థానిక నాయకులు చెరుకూరి రేణుక జగన్, కాలనీ ప్రెసిడెంట్ జిల్కపల్లి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ కంటే ముందే మరో మగ బిడ్డ!..

ఆత్మకథలో సోనియా గాంధీ షాకింగ్ విషయం

ఢిల్లీ:

కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ మంగళవారం విడుదలైంది. తన జీవితంలో చోటు చేసుకున్న ఎవరికీ తెలియని అనేక విషయాలను ఆమె ఈ పుస్తకంలో వెల్లడించారు. రాజకీయంగా జరిగిన కీలక పరిణామాలతో పాటు గాంధీ కుటుంబంలో చోటు చేసుకున్న సంచలనాలను ఆమె ప్రస్తావించారు. అయితే సోనియా గాంధీ-రాజీవ్ గాంధీ దంపతులకు రాహుల్ గాంధీ, ప్రియాంక వాద్రా గాంధీ మాత్రమే సంతానం ఉందని చాలా మంది అనుకుంటుండగా ఈ పుస్తకంలో సోనియా గాంధీ షాకింగ్ విషయం బయటపెట్టారు. తమకు మరో కుమారుడు సైతం పుట్టినట్లు వెల్లడించారు.

అత్యంత విషాదకరమన ఘటన:

తన జీవితంలోని అత్యంత విషాదకరమైన సంఘటనను తొలిసారిగా ఆత్మకథలో సోనియా గాంధీ వెల్లడించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో వివాహం తర్వాత తమకు జన్మించిన తొలి కుమారుడు పుట్టిన కొద్ది గంటలకే మరణించాడని గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తామిద్దరం ఎంతగానో కుంగిపోయామని, రాజీవ్ గాంధీ సైతం తనతో పాటు కన్నీళ్లు పెట్టుకున్నారని వెల్లడించారు. రాహుల్ గాంధీ జన్మించడానికి ఏడాదికి పైగా ముందు జరిగిన ఈ విషాదం తమ కుటుంబాన్ని తీవ్రంగా కలచివేసిందని వివరించారు.

ఇందిరా గాంధీ ఎంతో సంతోషించారు:

1969 జనవరిలో ఈ ఘటన జరిగినట్లు సోనియా తన పుస్తకంలో పేర్కొన్నారు. తాను గర్భం దాల్చిన విషయం తెలిసినప్పుడు గాంధీ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసిందని గుర్తుచేసుకున్నారు. సాధారణంగా బహిరంగంగా ఆప్యాయతను వ్యక్తం చేయడానికి ఇష్టపడని ఇందిరా గాంధీ సైతం ఆ వార్త విని ఎంతో సంతోషించారని తెలిపారు. తనను ఆప్యాయంగా హత్తుకుని అభినందించారని పేర్కొన్నారు. "ఒక పెద్ద బిడ్డకు మరో బిడ్డ పుట్టబోతోంది" అంటూ ఇందిరా గాంధీ సరదాగా వ్యాఖ్యానించినట్లు సోనియా గుర్తుచేసుకున్నారు.

నెలలు నిండకుండానే బిడ్డకు జన్మ

అయితే ప్రసవానికి ఇంకా రెండు నెలల సమయం ఉండగానే తనకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయని దీంతో 1969 జనవరి 18న ఆమె మగబిడ్డకు జన్మనిచ్చినట్లు సోనియా పేర్కొన్నారు. బిడ్డ నెలలు నిండకుండానే పుట్టినప్పటికీ ఆరోగ్యంగా కనిపించాడని సోనియా రాశారు. బిడ్డను ఇంక్యుబేటర్‌లో ఉంచినప్పుడు తొలిసారిగా అతడి ఏడుపు వినిపించిందని, ఆ తర్వాత రాజీవ్ తనను బిడ్డను చూసేందుకు తీసుకెళ్లారని తెలిపారు. చిన్న శరీరం, ఒత్తైన నల్లటి జుట్టు, పొడవైన సన్నని వేళ్లతో ఎంతో అందంగా కనిపించాడని వివరించారు. 'మేము అతడిని చూసిన వెంటనే ప్రేమలో పడిపోయాం' అని సోనియా తన పుస్తకంలో భావోద్వేగంగా పేర్కొన్నారు. అయితే ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదని బిడ్డ ఆరోగ్య పరిస్థితి ఆశాజనకంగా లేదని వైద్యులు ముందుగానే హెచ్చరించినట్లు తెలిపారు. పుట్టిన కొద్ది గంటలకే ఆ చిన్నారి మరణించగా, మరుసటి ఉదయం ఈ విషాద వార్తను వైద్యులు తమకు తెలియజేశారని వెల్లడించారు.

కన్నీళ్లు పెట్టుకున్న రాజీవ్ గాంధీ

బిడ్డ మరణవార్త విన్న తన భర్త, తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యామని "ఎందుకు ఇలా జరిగింది? ఇది సాధ్యం కాదు" అంటూ తాను పదేపదే ప్రశ్నించానని తెలిపారు. సాధారణంగా భావోద్వేగాలను బయటకు వ్యక్తం చేయని రాజీవ్ గాంధీ కూడా ఆ సమయంలో తనతో పాటు కన్నీళ్లు పెట్టుకున్నారంటూ ఈ విషాదాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో పర్యటనలో ఉన్న ఇందిరా గాంధీ విషయం తెలుసుకుని తన కార్యక్రమాలను కుదించుకుని ఆసుపత్రికి తిరిగి వచ్చారని సోనియా తెలిపారు. దుఃఖంలో ఉన్న తమను ఆమె ఆప్యాయంగా హత్తుకుని ఓదార్చారని, ఆమె కళ్లు ఎర్రబడి వాచిపోయి ఉన్నాయని గుర్తుచేసుకున్నారు.

బిడ్డ అంత్యక్రియల విషయంలో విభేదాలు

చిన్నారి అంత్యక్రియలు ఎలా నిర్వహించాలనే విషయంలో



కుటుంబంలో చర్చ జరిగిందని సోనియా వెల్లడించారు. అప్పట్లో నవజాత శిశువుల అంత్యక్రియలకు సంబంధించి అనుసరించే సంప్రదాయాల్లో భాగంగా మృతదేహాన్ని నదిలో వదిలేయాలనే ఆలోచన రావడంతో తాను తీవ్రంగా కలత చెందానని తెలిపారు. గతంలో ఢిల్లీలోని ఓఖ్లా బ్యారేజీ వద్ద నీటిలో చిక్కుకున్న ఓ మృతదేహాన్ని చూసిన జ్ఞాపకం తనను వెంటాడిందని పేర్కొన్నారు. 'ఎట్టి పరిస్థితుల్లోనూ మా బిడ్డను నదిలో వదిలేయడానికి నేను అంగీకరించను' అని తాను స్పష్టం చేసినట్లు సోనియా రాసుకున్నారు. చివరకు దక్షిణ ఢిల్లీలోని మెహ్రౌలీలో ఉన్న ఫిరోజ్ గాంధీ వ్యవసాయ క్షేత్రంలో చిన్నారిని ఖననం చేయాలని కుటుంబం నిర్ణయించింది. రాజీవ్ గాంధీ, ఆయన సోదరుడు సంజయ్ గాంధీ కలిసి గులాబీ రంగు బొగెన్‌విల్లా మొక్క కింద బిడ్డకు అంత్యక్రియలు నిర్వహించినట్లు సోనియా వివరించారు. ఆ తర్వాత చాలాకాలం అక్కడికి వెళ్లినప్పుడల్లా ఆ ప్రదేశంలో పూలు ఉంచేవారమని గుర్తుచేసుకున్నారు.

వారి విమర్శలతో మరింత కుంగిపోయా

బిడ్డను కోల్పోయిన బాధ నుంచి తేరుకోవడానికి తనకు చాలా నెలలు పట్టిందని సోనియా తెలిపారు. ఆ సమయంలో కొందరు రైటిస్ట్ భావజాలానికి చెందిన ప్రచురణ సంస్థలు చిన్నారి పుట్టుక చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కథనాలు ప్రచురించడంతో తీవ్రంగా బాధపడ్డానని పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు తన మనసును తీవ్రంగా గాయపరిచాయని, మనుషులు ఇంత క్రూరంగా ఎలా వ్యవహరిస్తారని ప్రశ్నించినట్లు ఆత్మకథలో రాశారు.

ఆ తర్వాతే జన్మించిన రాహుల్ గాంధీ

తొలి కుమారుడిని కోల్పోయిన అదే ఏడాది సోనియా మరోసారి గర్భం దాల్చారు. అయితే గత అనుభవం కారణంగా ఈసారి కుటుంబంలో ఆనందం కంటే ఆందోళనే ఎక్కువగా ఉందని తెలిపారు. ఈ గర్భధారణ ఫలితంగానే 1970 జూన్ 19న రాహుల్ గాంధీ జన్మించారు. అనంతరం ప్రియాంక గాంధీ 12 జనవరి 1972లో జన్మించారు. తన జీవితంలోని అత్యంత వ్యక్తిగతమైన, బాధాకరమైన సంఘటనను సోనియా గాంధీ ఆత్మకథలో గుర్తు చేసుకున్నారు.

'ఓయూకు ఇస్తామన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ?'..

నాన్ టీచింగ్ ఉద్యోగుల ధర్నాలో కవిత విమర్శలు





స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ స్టాఫ్ శ్రమను, రక్తాన్ని దోచుకుంటున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకుంటామని, వర్సిటీకి వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జాడలేకుండా పోయాడని ధ్వజమెత్తారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఉస్మానియా నాన్ టీచింగ్ స్టాఫ్ వర్సిటీ అడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద చేపట్టిన ఆందోళనకు కవిత మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. 35 ఏళ్లుగా ఉస్మానియాలో నాన్ టీచింగ్ స్టాఫ్ కు అన్యాయం జరుగుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితే తెలంగాణ వచ్చిన తర్వాత కూడా ఉండటం క్షమించరని నేరమన్నారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో ఉద్యోగులు, ప్రొఫెసర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్నట్లుగానే ఉద్యోగి ఏడ్చిన యూనివర్సిటీ బాగుండదన్నారు.

వీసీని చరిత్ర క్షమించదు

నాన్ టీచింగ్ ఉద్యోగులంతా నమన్యలతో ఇబ్బందులు పడుతుంటే వారికి అండగా ఉండాల్సిన వీసీ.. ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారని కవిత మండిపడ్డారు. టైమ్ స్కేల్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండగా వారిని కాదని కొత్త వాళ్లను నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ముందు ఉద్యోగులపై ప్రేమ చూపించాలని కోరారు. ఉద్యోగులు ఆందోళన చేస్తుంటే వారిని వీసీ ఇబ్బందులు పెడుతున్నాడని మండిపడ్డారు. ఉస్మానియాకు 105 ఏళ్లలో తొలిసారి మాదిగా బిడ్డను వీసీని చేశామని ముఖ్యమంత్రి గొప్పలు చెబుతున్నాడని..కానీ నిధులు ఇవ్వకపోతే ఆయన మాత్రం ఏం చేస్తాడని ప్రశ్నించారు. నిధులు ఇవ్వకుండా వీసీ ని బలి చేసే ప్రయత్నం చేస్తున్నారా? లేదంటే వీసీయే ప్రభుత్వం కోసం ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నాడా అని నిలదీశారు. అటానమస్ గా ఉండి ఉద్యోగులకు కోసం పోరాటం చేయాల్సిన వీసీ ప్రభుత్వానికి గులాం గిరి చేయటం మంచిది కాదని చెప్పారు. యూనివర్సిటీ కోసం ప్రభుత్వం తో కొట్లాడి బాగు చేసుకున్న వీసీలను చరిత్ర గుర్తుపెట్టుకుంటుందని.. కానీ ప్రభుత్వం కోసం వర్సిటీ ప్రయోజనాలను తాకట్టు పెడితే చరిత్ర క్షమించదని వీసీని హెచ్చరించారు.

ఏడాదిన్నరగా పట్టించుకోవటం లేదు

ఏడాదిన్నరగా నాన్ టీచింగ్ స్టాఫ్ ఆందోళనలు, ధర్నాలు చేస్తుంటే ఎందుకు స్పందించటం లేదని కవిత ప్రశ్నించారు. నాన్ పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చే ప్రయోజనాలు లేకుండా చేస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాల్లో వ్యవహరించే తెలితేటలను ముఖ్యమంత్రి వద్ద ప్రదర్శించి ఉద్యోగులకు వేలు చేయాలని కోరారు. ఓయూలో 85 శాతం లోకల్ వాళ్లనే నియమించుకోవాల్సి ఉన్నప్పటికీ బీహార్, యూపీ వాళ్లను సెక్యూరిటీ కోసం నియమిస్తున్నారన్నారు. యూనివర్సిటీలో జరిగే అవినీతి బయట పడకుండా ఉండేందుకే బయట వాళ్లను నియమిస్తున్నారా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. నాన్ టీచింగ్ స్టాఫ్ సమస్య లపై వర్సిటీ ఛాన్సలర్ గా ఉన్న గవర్నర్ ఎందుకు స్పందించటం లేదని ఆమె ప్రశ్నించారు. వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకోని నాన్ టీచింగ్ స్టాఫ్ కు మేలు జరిగేలా చూడాలని గవర్నర్ ను కోరారు.

ఓపీఎస్ అమలు చేయాలి

ఉస్మానియాలో ఉద్యోగులకు ఓపీఎస్ స్కీమ్ వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి పచ్చి అబద్దాలు చెప్పారని కవిత అన్నారు. 2001 నుంచి 2004 వరకు ఉన్న వారికి ఈ స్కీమ్ వర్తింపజేయాలన్నారు. 2004 నుంచి ఉన్న వారికి కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను వర్తింపజేయాలన్నారు. ఏటా ఉద్యోగులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని క్రమం తప్పకుండా చెల్లించాలని, చనిపోయిన టైమ్ స్కేల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల వ్యవస్థ తీసేసి అందరినీ వర్మినెంట్ చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్కీమ్ ను రెగ్యులర్ ఎంప్లాయిస్ మాదిరిగా వర్తింజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు చేసే పోరాటానికి తాము అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. అదే విధంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులైనా శ్రీకాంత్ గౌడ్, ఆకాష్ లకు అండగా నిలవాలని ఉద్యోగులను ఈ సందర్భంగా కవిత కోరారు.

బాయిలర్ల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

రాష్ట్రంలో బాయిలర్ల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బాయిలర్ల సర్టిఫికెట్ల గడువు మరో మూడు నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ప్రభుత్వం జీవో నంబర్ 465 జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం చూపిందని వివరించింది. దీంతో ఇంధన వినియోగాన్ని సమర్థంగా నిర్వహించేందుకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపింది. 100 టన్నులు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బాయిలర్లకు ఈ వెసులుబాటు వర్తిస్తుందని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో విద్యుత్ కేంద్రాలు, చమురు, గ్యాస్ పరిశ్రమలకు ఊరట కలిగిస్తుంది. అలాగే పెట్రోలియం రిఫైనరీలు, పెట్రోకెమికల్‌తోపాటు ఎరువుల పరిశ్రమలకు వెసులుబాటు కల్పిస్తుంది. 2026, నవంబర్ 30వ తేదీ వరకు మాత్రమే గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ అమలు కానుంది. ఆరు నెలల్లో సర్టిఫికెట్ గడువు ముగిసే బాయిలర్లకు మూడు నెలల పొడిగింపు ఇచ్చింది. భద్రతా ప్రమాణాలు, సాంకేతిక తనిఖీలు మాత్రం తప్పనిసరి అని జారీ చేసిన జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది.

హసన్‌పర్తి మీడియా పాయింట్ నూతన కార్యవర్గ ఏకగ్రీవ ఎన్నిక

అధ్యక్షుడిగా జక్కుల విజయ్ కుమార్.. : ప్రధాన కార్యదర్శి సందెల సాగర్

స్టార్ త్రినేత్రం, హసన్‌పర్తి:



హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల మీడియా పాయింట్ నూతన అధ్యక్షుడిగా జక్కుల విజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎర్రగట్టుగుట్ట కళ్యాణ మండపంలో మంగళవారం మండల జర్నలిస్టులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా జక్కుల విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సందెల సాగర్, ఉపాధ్యక్షులుగా, కోప్పుల రాజేందర్, దాడి బిక్షపతి, సందెల రాజు, కోశాధికారిగా దాడి చిరంజీవి, సహాయ కోశాధికారిగా మండ రాజేష్, కార్యదర్శులుగా బొక్క రాజు, వాజిద్, సహాయ కార్యదర్శులుగా రామంచ మధుకర్, చెన్నూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అదేవిధంగా సలహాదారులుగా సయ్యద్ అహ్మద్, దండుగూడెం రాజకుమార్, కార్యవర్గ సభ్యులుగా రేణికుంట్ల దుర్గాప్రసాద్, రాజారపు భిక్షపతి, ఎర్ర కుమార స్వామి, పెసరు సూర్య ప్రకాష్, చెంగేల్లి నరేష్ చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జక్కుల విజయ్ కుమార్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఐక్యతకు పెద్దపీట వేస్తానని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మీడియా పాయింట్ సభ్యులు కే.కార్తీక్, బండారి సుమన్, పత్తిపాక విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన వెస్ట్ జోన్ డీసీపీ

పోలీస్ సిబ్బందికి పలు సూచనలు..
ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశం



స్టార్ త్రినేత్రం, వర్ధన్నపేట:

వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌ను వెస్ట్ జోన్ డీసీపీ రాజా మహేంద్ర నాయక్ ఐపీఎస్ మంగళవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పనితీరు, సిబ్బంది కిట్, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ, కేసుల దర్యాప్తు తీరుతో పాటు ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ రాజా మహేంద్ర నాయక్ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ ప్రధాన ఉద్దేశం స్టేషన్ పనితీరును సమీక్షించడం, సిబ్బంది విధి నిర్వహణలో లోపాలను గుర్తించి అవసరమైన సూచనలు చేయడం అని తెలిపారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన, నాణ్యమైన పోలీస్ సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కేసుల దర్యాప్తులో వేగం, పారదర్శకత పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పోలీస్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.



టీపీసీసీ అధికార ప్రతినిధి బోడా డిన్నకు మహమ్మద్ అయూబ్ అభినందనలు



స్టార్ త్రినేత్రం, వరంగల్:

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధికార ప్రతినిధిగా నూతనంగా నియమితులైన బోడా డిన్నకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మంగళవారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బోడా డిన్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహమ్మద్ అయూబ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు జిల్లా అధ్యక్షుడు శాలువా కప్పి ఘనంగా సత్కరించి, నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకత్వం బోడా డిన్నపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించడం ఆయనకు పార్టీ పట్ల ఉన్న అంకితభావం, రాజకీయ అనుభవానికి గుర్తింపు అని మహమ్మద్ అయూబ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంలో అధికార ప్రతినిధిగా ఆయన కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. పార్టీ అభివృద్ధికి, సంస్థాగత బలోపేతానికి సమన్వయంతో పనిచేస్తూ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాషాపాక సదానందం, కొత్తపల్లి శ్రీనివాస్, మొహమ్మద్ కమలుద్దీన్, ఎర్రం కమల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని బోడా డిన్నను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.



నామకరణ వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన గుండు సుధారాణి

మహిళా కాంగ్రెస్ నేత నారగోని స్వప్న మురళి కుటుంబంలో వేడుకకు హాజరు



స్టార్ త్రినేత్రం, వరంగల్:

కాంగ్రెస్ పార్టీ వరంగల్ నగర మహిళా అధ్యక్షురాలు నారగోని స్వప్న మురళి మనుమడి నామకరణ, డోలారోహణ వేడుక మంగళవారం కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాకతీయ వట్టణాభివృద్ధి నంస్థ (కుడా) చైర్‌వర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యతో కలిసి వేడుకలో పాల్గొన్న ఆమె చిన్నారిని ఆప్యాయంగా ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబంలో కొత్త సభ్యుడి రాకతో ఇల్లు ఆనందోత్సాహాలతో నిండాలని, చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, సోషల్ మీడియా కన్వీనర్ సోమ లక్ష్మి, మేరవాడ శివాలయం ధర్మకర్త పాలకుర్తి సుమన్ గౌడ్ తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

తెలంగాణ రక్షణ సేనలో చేరికల జోరు



స్టార్ త్రినేత్రం, కొడంగల్:

తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరికల పర్వం కొనసాగుతోంది. కొడంగల్ నియోజకవర్గ ఇన్చార్జి రాజ ప్రభాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా టీఆర్ఎస్ కు విశేష స్పందన వస్తోంది. ముఖ్యంగా టీఆర్ఎస్ లో చేరికల జోష్ కొనసాగుతోంది. తాజాగా మంగళవారం కొత్తపల్లి మండలం భూనిడ్ గ్రామానికి చెందిన పలువురు యువకులు తెలంగాణ రక్షణ సేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.పార్టీలోకి చేరిన వారిలో ప్రేమ్, నరేష్, వెంకటేష్, విజయ్ కుమార్ చారి, అజయ్ ఉన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి రాజ ప్రభాకర్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి యువత ముందుకు రావడం శుభపరిణామమని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ రక్షణ సేన పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు శివశంకర్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజప్రభాకర్ నాయకత్వం భేష్.. నేతల కితాబు



స్టార్ త్రినేత్రం, కొడంగల్:

తెలంగాణ రక్షణ సేన పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్చార్జి రాజ ప్రభాకర్ నాయకత్వంలో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఆయన చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, యువతను ఆకట్టుకునే నాయకత్వ శైలి పట్ల నియోజకవర్గంలో విశేష స్పందన లభిస్తోంది.ఇందులో భాగంగా మంగళవారం మద్దూరు మండలంలోని పలు గ్రామాల నూతన కమిటీ సభ్యులు మరియు కార్యకర్తలు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించి, రాజప్రభాకర్ పట్ల తమ పూర్తి మద్దతును ప్రకటించారు ఈ సందర్భంగా రాజప్రభాకర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, ప్రజల సమస్యల పరిష్కారానికై ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సన్మాన మరియు అభినందన కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

'ఫ్రాంక్‌ఫిన్ శిక్షణ సంస్థపై సమగ్ర విచారణ జరపాలి'..

విద్యార్థులను మోసం చేస్తున్నారంటూ పీడీఎస్‌యూ ఆందోళన..
ఫ్రాంక్‌ఫిన్ ఇన్స్టిట్యూట్ దిష్టిబొమ్మ దహనం



స్టార్ త్రినేత్రం, హనుమకొండ:

ఎయిర్ హోస్టెస్ ఉద్యోగాల పేరుతో విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తూ, ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని ఆరోపిస్తూ హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న ఫ్రాంక్‌ఫిన్ ఎయిర్ హోస్టెస్ శిక్షణ సంస్థపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో సంస్థ మంగళవారం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, కార్యదర్శి రాచకొండ రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. ఎయిర్ హోస్టెస్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగాలు రాని విద్యార్థులకు సైతం ఉద్యోగాలు వచ్చినట్లు పత్రికా ప్రకటనలు ఇస్తూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. పీడిత విద్యార్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే స్పందించి సంస్థపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న శిక్షణ సంస్థలపై ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించి పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. లేనిపక్షంలో ఇలాంటి మోసాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లిదండ్రులు ఆకర్షణీయమైన ప్రకటనలు, ఉద్యోగ హామీలను గుడ్డిగా నమ్మి తమ పిల్లల భవిష్యత్తును, డబ్బును ప్రమాదంలోకి నెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత విద్యార్థులు ముషారఫ్, మోక్షజ్ఞ, విక్షిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం..

విద్యా సంస్థల్లో సినిమా ప్రమోషన్లు నిషేధం!

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన విద్యా సంస్థలు ఇటీవల కట్టుతప్పుతున్నాయి. తమ పిల్లలు భవిష్యత్ కోసం రూ.లక్షలు పోసి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివిస్తున్నారు. కానీ కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులను తమ రాజకీయ, కుటుంబ అవసరాల కోసం వినియోగించుకుంటున్నాయి. ఈ క్రమంలో అనేక అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోవడమే కాకుండా కొన్ని సార్లు విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో విద్యా సంస్థల్లో సినిమా, ఇతర ప్రైవేటు కార్యక్రమాల ప్రమోషన్లపై నిషేధం విధించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇటీవలి కొన్ని విద్యాసంస్థల్లో చోటుచేసుకున్న పరిణామాలు ప్రభుత్వంతో పాటు తల్లిదండ్రులు, విద్యావంతుల్లో ఆందోళన నెలకొంది. విద్యా సంస్థల యాజమాన్యాలు ఇష్టారీతిగా సెలవులు ప్రకటించడం, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండానే భారీ కార్యక్రమాలు చేపట్టడంతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం తల్లిదండ్రులను తీవ్రంగా కలవరపరుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో విద్యా సంస్థలు చట్టపరంగా వారి క్యాంపస్‌లలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవచ్చు, ఎటువంటివి నిర్వహించకూడదనే అంశంపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ప్రభుత్వ పెద్దలు విద్యా శాఖాధికారులను ఆదేశించినట్లు సమాచారం.ప్రభుత్వ యోచన ప్రకారం... ప్రాథమికంగా, విద్యా సంస్థల ప్రాంగణాలను విద్యా, క్రీడా కార్యక్రమాలకు మినహా సినిమా, ఇతర వాణిజ్య కార్యక్రమాలకు వినియోగించకూడదు. విద్యా, క్రీడా కార్యక్రమాలు భారీ ఎత్తున నిర్వహిస్తే, ఎంత మంది హాజరవుతారు, స్టేజీ నిర్మాణం, రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు, ఫైర్ సేఫ్టీ తదితర వివరాలను ముందుగానే స్థానిక విద్యా శాఖ అధికారులు/ పోలీసులకు అందజేయాలి. క్రీడా, సాంస్కృతిక, కళా రంగానికి సంబంధించి విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే, ప్రోత్సహించే చిన్న కార్యక్రమాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోదు. వందలాది మందితో నిర్వహించే వాటి విషయంలో మాత్రం విద్యా సంస్థలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి. ఉద్యోగాల కల్పన, స్టార్టప్స్, ఆవిష్కరణల్లో తెలంగాణ విద్యార్థులు గొప్ప ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు, గూగుల్ ఫర్ స్టార్టప్స్, ఏఐ ఇన్నోవేషన్ హబ్, తెలంగాణ ఇన్నోవేషన్ స్టార్టప్ ఛాలెంజ్ వంటివి చేపట్టింది. కళలు, సంస్కృతి, సృజనాత్మకతకు సంబంధించి గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానం, యంగ్ ఇండియా ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ వంటి కార్యక్రమాలు నిర్వహించింది. అదే సమయంలో కొన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు అందుకు భిన్నంగా తాము నూచించిన సినిమాలు చూడాలని, ఆ సినిమా చూసేందుకు సెలవులు సైతం ప్రకటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ప్రభుత్వం సైతం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఇటీవల ఒక విద్యా సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో స్టేజీ కూలి విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడంతో పాటు పలువురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో విద్యా సంస్థలకు మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com